# విమల కూల్చిన ఉక్కుగోడలు

రంధి సోమరాజు

కథానిక

విమల సూర్యంబాబు భార్య ఇరవై ఏళ్లు నిండీ నిండని సొయగపు వెన్నెల వయసు వచ్చినా తల్లి ఒడిని వదిలిపెట్టని పావలా అదే మిటో చిత్రంగా ఆమెనుంచి సిగ్గువేరు పడదు. ఆ నల్లని విశాలమైన కనురెప్పలలోంచి ఆమె ఎదలోని కరుణ నీరెండలా మోహనంగా మెరిసి పోతుంది ఆ చిన్నారి నుదుటిమీది సుందర తిలకమైపోతుంది అది అలాఅలా ఆ పాపట లోంచి తన కిరణ పుంజాలతో జారి తలలో తురిమిన పూలగుండెల్లోంచి సువాసనై గుప్పు మంటుంది నిజంగా ఆమె ఒక అందం. అందంలోని మాధుర్యం సూర్యం క్షణంవిడిచి ఉండలేని హృదయం!

ఆమె పట్నంలో ఇంటరు ప్యాసయింది. స్కూలుఫైనలే ప్యాసయిన సూర్యాన్ని పెళ్లి చేసుకుంది

సూర్యం ఆ వూరికి దొరబాబు గ్లాస్గోపంచెకట్టి, లోపలి బనీనును బయ టికి కనిపించే ఖరీదైన పచ్చని సిల్కు లాల్చీ తొడిగి నల్లని కళ్లద్దాలలో, లోకానికి తన హృద యము దొరికి పోకుండా దాచుకుంటాడు! చేతికి రిస్టువాచీ, వ్రేళ్ళకు రవ్వల ఉంగరాలు సరే సరి. అన్నింటికన్నా అతని గుణాన్ని సంస్కా రాన్ని ఇట్టే పట్టి ఇచ్చేది మెడలో సన్నగా లాల్చీ అడుగున మెరిసే సన్నని బంగారు గొలుసు!

విమల సూర్యంతో కలిసి పెళ్ళయిన మొదట్లో సాయింకాలాలు అలా పొలాలవైపు తిరిగిరావాలని ఎంతో ఆశపడేది. ఒకటి రెండు సార్లు భర్తతో వెళ్ళింది. కాని ఆమె అలా వెళ్లడం (వెళ్ళడం అనడంకన్నా తిరగడం అంటేనే ఆ వూరివారి దృష్ట్యా బాగుంటుంది.) ఆమె అత్తగారికిగాని, ఆడబడుచులకుగాని మావ గారికిగాని కిట్టలేదు. ఆ వూళ్లోని ఆమె భర్త తరఫు పెద్దపెద్ద ఆస్తులున్న హేమా హేమీ బంధువులంతా డోకు మొగాలుపెట్టి అనగూడని మాటలు ఆ మొగాల్లోంచి కక్కుకున్నారట! ఇదంతా చూసి సూర్యం జడిసిపోయాడు సూర్యం బాధపడడం భరించలేని విమల పాపం అంతటితో ఆ ఆశలను త్రుంచేసు కుంది గెడ కర్రెత్తున ఇంటి చుట్టూ కట్ట బడ్డ గాజు పెంకులు మొలచిన ప్రహారీ గోడల మధ్య, లోలోపలి గదుల్లో, వింత వింత అలం కరణల విద్యూరాల నడుమ ఆమె తిరగడం అల వాటు చేసుకోవలసి వచ్చింది పాపం అక్కడ ఆమెకేమి పని ఉంటుంది! చదివితే పుస్తకాలు ఎంతసేపని చదువగలదు? ఇక అస్తమానం ఒకటే ముస్తాబైనా మొహం మొత్తుతుంది కళ్ళల్లోని అందాలకు మురిసిపోతూ పాదాల లోని సౌందర్యానికి పరవశత్వం చెందుతూ ఎంతసేపని అలసిపోగలదు?

ఆమె మనసు ఆమె చదువుతున్న రోజుల ఒడిలోకి వెళ్ళి వ్రాలిపోయేది కాలేజీలో తను అందరితోనూ కలిసి మెలసి తిరగడం, అంతా కలసి ఏవేవో సాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటూ ఉండడం, వరద లొచ్చి ఇళ్ళు కూలిపోతే, నిప్పంటుకొని ఇళ్ళు కాలిపోతే, ప్రజలకుసహాయపడివాళ్లకు ఆహారం, బట్టఅవసరమైతే డబ్బు ఎక్కడెక్కడో సంపాదించి, పంచిపెట్టడం అన్నీ అన్నీ గుర్తుకు తెచ్చుకొనేది. అవి గుర్తు కొచ్చినప్పుడల్లా ఆమె కళ్ళలో నీళ్లు తిరిగేవి తను ఎందుకూ పనికిరాని, కొరగాని మొద్దులా తయారవుతూన్నట్లు కుమిలిపోయేది. 'అయ్యో....నేనీ వూళ్ళో ఎంతో మందికి ఎన్నో విధాల సహాయపడొచ్చు....కాని ఏమీ చేయ లేక పోయేది. చెప్పడానికేమిటో అభిమానం అడ్డొచ్చేది. భర్త కిదంతా చెప్పినా లాభం ఉండదని ఆమెకు తెలుసు. చుట్టూఉన్న వాతావరణాన్ని వీలైతే తను జయించగలగాలి. అవసరమైతే అత్తగారిని మావగారిని, చివరికి భర్తనుకూడా ఎదిరించగలగాలి అనుకునేది

కాని ఏమిటో ఆమెలో అంత తెగింపు వచ్చేది కాదు. కాలేజీలోకూడా ఆమె అంతే. తోటి విద్యార్థినులు ఎంతో బలవంతం చేస్తేనేగాని ఆ పనుల్లో పాల్గొన లేకపోయేది. నిజానికి వాళ్ళం దరికన్నా ఆమెకే ఎక్కువగా సంఘసేవ చేయా లనే ఆసక్తి ఉండేది కాని ఎవ్వరో ఒకరు ఆ పనిలోకి తీసికెళ్ళి పెడితేగాని ఆమె తానుగా అందులోకి దిగలేకపోయేది స్వతహాగా ఆమెలో సిగ్గెక్కువ విషయాలను విపులంగా నచ్చ జెప్పే మాటల దోరణి తక్కువ ఆమెకు సంఘ సేవ చేయాలని మనసు నిండా ఉంటుంది, కాని చుట్టూ ఉన్న అడ్డంకులను సులువుగా దాటడానికి వీలైన వాతావరణం ఎలా సృష్టించు కోవాలో ఆమె ఊహించలేకపోయేది.

ఆ అందమైన గదులు, వాటిలోని రక రకాల సుందరమైన సామానులు అన్నీ అన్నీ తనలోని సుకుమారమైన భావాలను మెల్లి మెల్లిగా తేనెపూసిన కత్తిలా తెగ కోసేస్తున్నాయా అని భయపడిపోయేది. ప్రకృతిలోకి పోయి ఆ భావాలకు కావలసిన బలాన్ని ఎప్పుడు సేక రించు కొంటానా అని ఆత్రుత పడేది. కాని ఎట్లు వీలు చిక్కుతుంది? బయటికి కాలు పెట్టాలంటే సిల్కు తెరలున్న సవారిబండి సిద్ధంగా ఉంటుంది. అందులో మెత్తనిపరుపులే ఉంటాయి లోకాన్ని చూడకండా లోకంలో బ్రతకడం ఎట్లాగో ఆమె కర్థమయ్యేది కాదు.

సూర్యంబాబు కుటుంబానికి ఈడుజోడైన కుటుంబాలు ఆ వూళ్లో మూడో, నాలుగో ఉన్నాయి విమల ఎక్కడికైనా వెళ్ళాలంటే వాళ్ళ ఇళ్ళకే వెళ్ళాలి. వాళ్ళు తమతమ గొప్పలు ఇంతింత చేసి చిలుకల్లా తెగ వాగు తూంటే, ఓపికుంటే వినాలి లేకపోతే వచ్చిన దారినే వెంచేయాలి.

పాపం విమల మనస్సు రోజురోజుకూ కృశించిపోతుంది. ఇంట్లో పనిచేసే దాసీల బండబారిన చేతులు చూసినప్పుడు, వాళ్ళ పాదాల పగుళ్ళు చూసినప్పుడు, శీతకాలాన పగిలి పోయేవాళ్ళ పెదవులు చూసినప్పుడూ ఆమె గుండె పగిలిపోయేది. ఆ మాలగూడెం అంటుంక పోయిందని, ఈ ఊడ్పుల పిల్లను ఫలానా ఖామందుల అబ్బాయి చెరిచాడని విన్న ప్పుడు ఆమె మనస్సు ఖేదపడిపోయేది గర్భిణీ స్త్రీల అవస్థలూ, నాటు మంత్రసానుల దురుసు మాటలు, వారి వికృత చేష్టలు తెలుసుకొని సహించలేకపోయేది. కాని ఏమీ చేయలేక పోయేది. చుట్టూ ఉన్న గోడల్ని పగులగొట్ట లేకపోయేది!

• • •

ఆ రోజున ఎండ తీక్షణంగా ఉంది విమల ఏదో పుస్తకం చదువుకుంటూందన్నమాటేగాని ఆమె మనసులో మనసులేదు అప్పుడే అక్క డకు రత్తి రొప్పుకుంటూ వచ్చింది ఆమె మొగంలో భయం తపతప కొట్టుకుంటోంది. వెంటనే విమల. 'ఏమిటి రత్నం.... అలా రొప్పు తున్నావేం....' అంది

విమల నౌకర్ల నెప్పుడూ 'ఏరా' అని గాని 'ఏమే' అని గాని పిలవదు. వాళ్ళను వాళ్ళ పేర్లతోనే పిలుస్తుంది. ఆ పేర్లు భ్రష్టరూపాన్ని దాల్చి అసహ్యమైన పేర్లు వాళ్ళకుండడవల్ల వాళ్ళు మానసికంగా అణిచివేయబడతారని ఆమె భావిస్తుంది

ఇక 'రత్నం' అంటే రత్తి అదేమిటో అదోలా ఉంటుంది దానికి రత్తి అని పిలి పించుకోవడమే బాగుంటుంది ''మా కెందు కమ్మా ఆ రాణీపేర్లు.... ఉల్లిపూలు మల్లెపూ లౌతాయా అమ్మా....''అంటుంది కాని విమల, 'నువ్వు ఉల్లిపూవు వనుకోవడమే తప్పు రత్నం' అంటుంది. అయితే ఈ మాట రత్తి కర్థమయ్యేది కాదు

తిరిగి విమల అడిగింది "ఏమిజరిగింది'' అని.

రత్తి 'ఇక మీరే రచ్చించాలమ్మా' అంది.

'అసలు వీమి జరిగిందో చెప్పవేం' అంది విమల.

'అ పోలీసోళ్ళు గొరిని చంపేత్తున్నారమ్మా గొరికాడ సారా ఎందుకుంటాదండి .... దాని దొడ్లో సారాబుడ్లు దొరికాయని ఇంకా ఎక్కడ దాచావో చెప్పు అని చిదుగబొడిచేత్తున్నారండీ' అంది.

రత్తి ఏం చెపుతోందో విమల కర్థంకాలేదు.

గౌరి దొడ్లో సారాబుడ్లు ఎందుకు దొరికాయి?" అంది.

రత్తి చెప్పనా మాననా అన్నట్లు విమల వైపు చూసింది.

'చెప్పడానికొచ్చి భయపడతావేం' అంది విమల. ఈ మాట రత్తికెంతో ధైర్యాన్నిచ్చింది.

"నాకు భయమేస్తోంది తల్లీ.... ఆ మాట తమరికెలా చెప్పాలో తెలియకుండా ఉందండి. మొన్న మధ్యాన్నపేల అది మన పొలం వేపు నడిచి వొత్తోందటండి....అప్పడే వర్షం వొత్తే మన పొలంలోని పాకలో అది దూరిందట. ఆడ అయ్యగోరున్నారటండి...." అని ఆగి పోయింది

ఈ మాట వినగానే విమల ఊపిరి పీల్చలేక పోయింది. ఆమె శరీరం వేడెక్కింది. ఆమె కనులు తీక్ష్ణంగా ఉన్నా వాటిలో ఏమి వినవలసి వస్తుందో అన్న భయం కొట్టుకుంటోంది. 'అయితే....' అంటూ ఆమె ఆగిపోయింది

రత్తి మెల్లిగా, 'గౌరి రంబలాగుంటాదమ్మా ఆళ్ళెవ్వరో పట్నం పోకిరీ వోళ్లు సైకిళ్ళమీద పోతూ కాలవొడ్డున నీళ్లు పట్టుకుంటూన్నదాన్ని చూసి, 'ఊర్వసినాగుందిరా' అనుకుంటూ పోనారండి. పేదోళ్లకి అందం పనికిరాదమ్మా. ఆ మట్టున బాబుగారు దాని చెయ్యి పట్టుకొని లాగారంట....దానికి భయమేసి బాబుగార్ని తోసేసిందట ఆరు ఆ మూలనున్న కర్రలమీద పడి పోనారటండి. అంతేనమ్మా....బాబుగారు పగబట్టి దాని దొడ్లో సారాసీసాలు పాతించారు; ఆ సారాలమ్మే చచ్చినోడిచేత. ఆ అమ్మేవోడు బాగానే ఉన్నాడు ఏమీ తెలియని మా గౌరినే చిదగ్గొట్టేస్తున్నారండి...." అంది కన్నీళ్ళు కారుస్తూ

అంతే....

విమల మొగంలో అన్యాయాలను సహించలేని మహత్తరమైన తేజస్సు వెలిగింది ఆమె ఇక రత్తితో ఏమీ మాట్లాడలేదు రత్తి కింత ధైర్యం ఆ మాటలు తనతో చెప్పేందు కెట్లా వచ్చిందో ఆమె ఊహించలేదు బుద్ధ భగవానునికి పీడిత ప్రజల బాధల నెఱుక పఱచిన రథసారథితో రత్తి నామె పోల్చుకోలేదు. పగుల


# ఆంధ్ర బ్యాంకు లిమిటెడ్

స్థాపితము—1923

ప్రధాన కార్యాలయము–మచిలీపట్టణము.

చెల్లింపబడిన మూలధనము మరియు రిజర్వులు రు. 47,90,000 మించినది.

అమలునందున్న వ్యాపార మొత్తము రు. 9,50,00,000 మించినది.

మద్రాసులోని శాఖలు : 6, లింగిచెట్టి వీధి, మద్రాసు 1. 77 కచేరీ వీధి, మైలాపూరు, మద్రాసు 4. 87 త్యాగరాయరోడ్డు, త్యాగరాయనగర్, మద్రాసు 17.

కర్నూలు ఆఫీసులు : 1/9 మెయిన్ బజారు, పేట. లెజిస్లేచరు సెక్రటేరియట్ భవనము (ఈ పే ఆఫీసు అసెంబ్లీ సెషన్సు జరుగుచున్నంత కాలము తెరచియుంచబడును.) మరియు ఆంధ్ర రాష్ట్రమంతటా, బళ్ళారి పట్టణములలోను, హైదరాబాదు రాష్ట్రమున సికింద్రాబాదు, ఖమ్మంమెట్టు, వరంగల్ లోను బ్రాంచీలు సబ్ ఆఫీసులు కలవు.

లండన్ ఏజెంట్లు: బార్క్లేస్ బ్యాంకు లిమిటెడ్, ఛీఫ్ ఫారిన్ బ్రాంచి. 168 ఫెన్ చర్చి స్ట్రీట్, లండన్, ఇ. సి. 3.

సేవింగ్సు డిపాజిట్లు నూటికి సంవత్సరమునకు రు. 2-8-0 వడ్డీ చొ. నెలవారి నిలువలమీదను, కరెంటు డిపాజిట్లు నూటికి సంవత్సరమునకు రు. 0-8-0 వడ్డీ చొ. రోజువారి నిలువలమీదను అంగీకరించబడును.

ఫిక్సెడు డిపాజిట్లు ఆకర్షణీయమైన వడ్డీరేట్లకు 3, 6, 9, 12, 24, మాసములకు అంగీకరించబడును. మూడు సంవత్సరముల క్యాషు సర్టిఫికెట్లు 100కి రు. 90/–చొ. యివ్వబడును. బంగారు వస్తువులమీద, గవర్నమెంటు పత్రములమీద, ఖులియను, ధాన్యము మరియు తదితర ఆహార దినుసులమీద అప్పులు యివ్వబడును.

చెక్కులు, హుండీలు వసూలు చేసిపెట్టబడును. ఫారిన్ ఎక్స్చేంజి సహా అన్ని రకముల బ్యాంకింగు వ్యాపారములు చేయబడును.

తాడేపల్లి శ్రీరాములు (మేనేజింగు డైరెక్టరు)

**ఏలేశ్వరపు రామచంద్రమూర్తి.**

ఎం. ఏ., సి. ఎ. ఐ ఐ. బి., (జనరల్ మేనేజరు)

గొట్ట బడుతూన్న ఉక్కుగోడల విషణ్ణవదనాల వికృత భావాలకు అణిగిపోవలసి వస్తుందేమో అన్న భావం ఆమెలో మొలకెత్తలేదు 'సిరికిం జెప్పడు' అన్న పద్యంలోని ఉదాత్త భావం ఆమెలో పనిచేస్తోందేమో అన్నదీ అంతు దొర కదు. కాని....కాని ఆమెలో అనంతమైనకరుణ, సుందరమైన మానవత విజృంభించాయి. అవే అవే ఆమెను ముందుకు నడిపాయి ఆమె ముందుకు సాగింది. ఏనుగంబారీ హాయిగా ఏ అడ్డంకీ లేకుండా ప్రవేశించడానికి వీలయ్యే ఆ గేటు ఎలా తెరచుకుందో తెలియదు!

కోడలు గేటు దాటుతూండడం చూసిన మావగారు, ప్రక్కనే కూర్చున్న భార్యతో, 'కోడలు ఎక్కడికి వెళ్తూంది? ...' అన్నాడు భార్య కుర్చీలోంచి కదలకుండానే 'విమలా అటెక్కడికి?....' అంది.

రత్తి, 'మీరెందుకండమ్మగారు....మీరెందు కండి....పెద్దయ్యగారితో సెప్పండి.. ' అంటూ హడలిపోయింది

కాని విమల ఆగలేదు

విమలను వీదిలోనివాళ్ళు వింతగాచూశారు ఆమె వెనుక ప్రక్కనున్న పూరిగుడిసెల్లోని స్త్రీలు వాళ్ళకు తెలియకుండానే నడిచారు అక్కడ గౌరిచుట్టూ ఎంతోమంది జనం పోగై ఉన్నారు పోలీసులు విమలను చూడగానే గౌరిని కొట్టడం మానేశారు

విమల తీక్ష్ణంగా పోలీసువైపు చూసి, 'ఎందు కా అమ్మాయిని కొడుతున్నారు' అంది

పోలీసు కొద్దిగా వణికాడు. 'ఇది సారాబుడ్లు దాచిందండి....' అన్నాడు.

వెంటనే విమల, 'ఆ అమ్మాయి ఇంతకు ముందెప్పుడైనా అలా దాచడం మీరు చూశారా....' అంది. 'మీకు తెలియదూ....ఆ సారాబుడ్ల సత్యం సంగతి, అతని పాక సంగతి. అతన్ని మీరెన్ని సార్లు పట్టుకోలేదు. ఇప్పు డతనివైపు అసలు తొంగి చూడకుండా, అతని ఇంట్లో ఎంత సారా ఉందో పట్టుకోకుండా.... ఎవరో కక్షకొద్దీ ఆ అమ్మాయి దొడ్లో సారాబుడ్లు పాతిపెట్టి మీకా వివరాలిస్తే మీరామెను చిద గ్గొట్టడానికి తయారవుతారా....ఆ అమ్మాయి నాకేమీ తెలియదు, మొర్రో అంటూంటే మీకు కొట్టడానికి చేతులెట్లా వచ్చాయి? అయినా కొట్టడానికి మీకు హక్కెవ్వరిచ్చారు? ఇందులో నిజం ఎంత ఉందో మీరెప్పుడు పరీక్షించారు? ముందువెళ్ళి ఆ సత్యాన్ని పట్టండి....ఈవూరి శని విరగడౌతుంది. అతన్ని అండగా పెట్టు కొని నాటకాలాడుతూన్న పెద్దలకు బుద్ధొ స్తుంది ' అంది.

అక్కడ ఉన్న వాళ్ళంతా విమల మాట్లా డిన ధోరణికి ఆశ్చర్యపోయారు ముసలమ్మలు, 'మాతల్లే... మాతల్లే.. ' అన్నారు పిల్లల తల్లులు, 'ఎంత చక్కగా మాట్లాడింది ఎంత చక్కగా మాట్లాడింది ఎంత గుండె నిబ్బరం ' అన్నారు

గౌరి విమలకాళ్ళు పట్టుకొని వదలలేదు విమల సిగ్గుపడిపోయింది తను ఇంతగా తెగించ డానికిగల కారణాన్ని వూహించుకొని మనసులో ఆశ్చర్యపోయింది భర్తను తను ఈ విష యంలో క్షమించగలిగితే ఊరి కెంతైనా మేలు జరుగుతుంది అని తలచింది

అంతే. ఆ రాత్రి, ఆ మరునాడు, ఆ తర్వాత మూడు రోజులు ఆ వూరిలో ఎవ్వరికీ నిద్రపట్ట లేదు. ఎక్కడ చూసినా ఇదే సంగతి ఊళ్లో ఏమి మార్పులు వస్తాయో, ఏం తగువులు వస్తాయో, ఎక్కడ కొంప లంటుకుంటాయో, ఎవరు ఖూనీచేయబడతారో అని అనుకున్నారు. విమలను సూర్యం బాబు వదిలేస్తా డనుకు కున్నారు.

కాని చిత్రం అలాంటి వేమీ జరుగలేదు. సరిగదా....విమల ఇప్పుడు ఆ వూరి నంతటినీ స్వర్గంలా మార్చేస్తోంది, అదే విచిత్రం!

[ఆలిండియా రేడియో ప్రసారితం]

